## క్లుప్తంగా

### డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



న్యూశాయంపేట: హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కర్రె భిక్షపతి, సిరబోయిన కరుణాకర్, ఆదిరి శ్రీనివాస్, అశోక్‌స్టాలిన్, వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి పాల్గొన్నారు.

### ఉద్యోగావకాశాలు కల్పించాలి



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ ఫ్యాక్టరీలో తమకు ఉద్యోగావకాశాలు కల్పించాలని భూ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి తమ భూమిని ఇచ్చిన 45వ డివిజన్ అయోధ్యపురం భూ నిర్వాసితులు సుబేదారిలోని స్వగృహంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్లరాజు యాదవ్, మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దేవర శ్రీను, మేరుగు రాజయ్య, వీరయ్య, శ్రీకాంత్, విజయ్ పాల్గొన్నారు.

### నిట్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం జీయాన్ (గ్లోబల్ ఇనిషియేటివ్ ఆఫ్ అకడమిక్ నెట్‌వర్క్స్) ప్రోగ్రాం అడ్వాన్స్ ఇన్ అనాలసిస్ అండ్ మోడలింగ్ ఆఫ్ హైడ్రాలిక్స్ ఎక్స్‌ట్రీమ్స్ అనే అంశంపై పది రోజుల వర్క్‌షాప్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా యూఎస్‌ఏలోని వర్జీనియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణశ్రీధర్, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పాల్గొని మాట్లాడారు.

### అనుమతి లేకుండా వైద్యసేవలు

హసన్‌పర్తి: తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ లేకుండా అల్లోపతి, మోడరన్ వైద్యసేవలు అందిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కేయూ పోలీస్ స్టేషన్‌లో మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ బాలయ్యకుమార్, చైర్మన్ డాక్టర్ కె. మహేష్‌కుమార్ ఫిర్యాదు చేశారు. నగరంలోని భీమారంలో సిరి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ నిర్వాహకుడు బి.కృష్ణప్రసాద్ (ల్యాబ్ టెక్నిషియన్), శ్రీ బాలాజీ క్లినిక్ నిర్వాహకుడు శ్రీకాంత్(ల్యాబ్ టెక్నీషియన్) జవహర్‌కాలనీ ప్రాంతంలోని మై హెల్త్ ఆస్పత్రి నిర్వాహకుడు కె.శరత్‌కుమార్ (బీ.ఫార్మసీ, ప్రభుత్వ ఉద్యోగి) మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ లేకుండా వైద్యసేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు నకిలీ వైద్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేయూ పోలీసులు పేర్కొన్నారు.

### 'యూనివర్సిటీ పేపర్ లీకేజీ సినిమాను వీక్షించండి'

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ పేపర్ లీకేజీ సినిమాను వీక్షించి ఆదరించాలని సినిమా నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి కోరారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కాకతీయ యూనివర్సిటీకి సోమవారం సాయంత్రం వచ్చిన నారాయణ మూర్తి.. క్యాంపస్‌లోని కేంద్ర గ్రంథాలయాన్ని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులతో కలిసి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. దేశంలో విద్యారంగం వ్యాపార రంగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, బీఆర్‌ఎస్‌వీ నాయకుడు అనిల్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాంపు

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌సీసీ కేడెట్ల క్యాంపు కొనసాగుతోంది. వచ్చే ఏడాది ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ పరేడ్‌కు ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక ప్రక్రియ సాగుతోంది. ట్రైనింగ్ కమాండెంట్ క్యాంపు కల్నల్ ఎస్ఎస్.రామదురై ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు పలు అంశాల్లో సోమవారం శిక్షణ ఇచ్చారు.

### ఆక్రమణలపై చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: అక్రమ కట్టడాలపై వెంటనే చర్య తీసుకోవాలని వనం రమణమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బల్దియా కార్యాలయంలోని సోమవారం గ్రీవెన్ సెల్ ఫిర్యాదు చేసి ఆమె మాట్లాడారు. వరంగల్ రంగశాయిపేట పద్మశాలి వీధిలో తమ ఇంటిస్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని తెలిపారు. ఈ విషయమై ఫిర్యాదు చేయగా అధికారులు రికార్డులను పరిశీలించి కబ్జాదారుడికి నోటీసులు జారీ చేశారని, అయినప్పటికీ కబ్జాదారుడు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

# ఖాళీ స్థలాలు.. వ్యాధులకు నిలయాలు



ప్రశాంత్‌నగర్ కాలనీలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



చైతన్యపురి కాలనీలో ఖాళీ స్థలంలో మురుగునీరు

- భూ యజమానులకు నోటీసులతోనే సరి

కాజీపేట: వర్షాకాలం.. వ్యాధులు ప్రబలే సమయం. పరిశుభ్రతకు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన తరుణం. మురుగు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. కాజీపేట పట్టణంలోని కొత్త, పాత కాలనీల్లో ఖాళీ స్థలాలు, గుంతల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల బెడదతో రాత్రి కంటి మీద కునుకు ఉండడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికమైన దోమల బెడద**

కాజీపేట పట్టణంలోని 8 డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాల యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి మిన్నకుండిపోతుండటంతో సమస్య తీవ్రత నానాటికి అధికమవుతోంది. యజమానులు కూడా ఖాళీ స్థలాలను పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఖాళీ స్థలాలు రోడ్డు కంటే తక్కువ ఎత్తు ఉండడంతో వర్షపు నీరు అందులో చేరిడంతో అవి చెరువును తలపిస్తున్నాయి. అవి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారడంతో కాలనీవాసులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మరికొన్ని ఖాళీ స్థలల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరగడంతో రాత్రి సమయంలో విష పురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అపరిశుభ్రత పరిసరాలతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని భయాందోళనకు గురవుతున్నారు.

**నివారణ చర్యలు శూన్యం**

అనేక కాలనీల్లో దోమల బెడద అధికంగా ఉంది. సాయంత్రం అయితే చాలు బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. మెష్ డోర్లు లేని ఇళ్లల్లో దోమలు చొరబడి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలి**



పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరుగుతున్న చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించాలి. ఖాళీ ప్లాట్లలో వర్షపు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఏడాదికోసారైన భూ యజమానుల సహాయంతో ఖాళీ స్థలాల్లో పెరిచిన చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించాలి.

- బండి విజయ్ కుమార్, కాజీపేట

**నోటీసులిస్తున్నాం..**

మున్సిపల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నాం. భూ యజమానులకు నోటీసులు జారీ చేసి ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- గొడిశాల రవీందర్, డిప్యూటీ కమిషనర్, కాజీపేట

**43వ డివిజన్‌లోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు**



గణేష్‌నగర్‌లో ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం 43వ డివిజన్‌లోని పలు కాలనీల్లోని ఖాళీ స్థలాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. గణేష్‌నగర్ కాలనీలో జనావాసాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో అందులో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు పెరిగి, చెత్తాచెదారం గుట్టలా పేరుకుపోతోంది. సంబంధిత భూ యజమానులు పట్టించుకోకపోవడంతో విష సర్పాలకు ఖాళీ స్థలాలు నివాసంగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి మురుగునీరు, వ్యర్థాలు, తాగిపడేసిన కొబ్బరి బొండాల వంటివి పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా అబ్బాస్ లేన్‌లో దోమల బెడద అధికమైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తుండడంతో విష జ్వరాల బారిన పడుతున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు అందజేసి ఆ స్థలాలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**దోమల బెడదను అరికట్టాలి**



గణేష్‌నగర్‌లోని ఖాళీ స్థలాలు మురుగు కుంటలుగా మారి ఏపుగా పెరిగిన కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో విషజ్వరాల బారిన పడుతున్నాం. ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను అధికారులు తొలగించి, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలి.

- హరిబాబు, స్థానికుడు

### కవితలు, పాటల పోటీలు



ట్రాఫిక్ సిగ్నల్‌పై ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై కవితలు, పాటల పోటీలను సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు హెచ్‌ఎం ఉమ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఓ మనిషి ఈ జన్మ మళ్లీ రాదురా.. ఆ ధూమపాన కోరల్లో చిక్కుకోకు రా అనే పాటను ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ రాసి వినిపించారు.

### విశ్వంభర కవుల వేదిక ప్రారంభం



కవుల వేదికను ప్రారంభిస్తున్న అనితారెడ్డి

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని సంగీత, సాహిత్య, నృత్య, అభ్యుదయ కళాసంస్థ శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వంభర కవుల వేదిక ప్రారంభమైంది. హనుమకొండ సర్క్యూట్ హౌస్ సమీపంలోని శ్రీసాయిమీరా సంగీత కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సామాజిక వేత్త డాక్టర్ అనితారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వంభర కవుల వేదికను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గూడ నరసింహమూర్తి, సంగీత విద్వాంసులు ప్రొఫెసర్ తిరుపతయ్య, విప్పనపల్లి రవికుమార్, సిరాజుద్దీన్, కవి అన్వర్, రాజమోహన్, కొడెం సుధాకర్, కాంచనపల్లి అనిత, నీరజ, మహేందర్ పాల్గొన్నారు.

## కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హన్మకొండ అర్బన్: కాకతీయ వైద్య కళాశాల మెన్స్, ఉమెన్స్ హాస్టళ్ల కార్మికులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ కార్మికులకు వచ్చే అరకొర వేతనాలు కూడా సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి అప్పుల పాలవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి జిల్లపల్లి సుధాకర్, కార్మికులు అల్లం రమేష్, రాణి, రాజకుమారి, ఎండీ.అతిక్, శశి, కవి, బాబు, రవి, అయేషా సుల్తానా, ప్రశాంత్, ఫాజియా, కర్ణ, సురేఖ, రాజేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 1న విద్యారంగ సమస్యలపై ధర్నా



ధర్నా పోస్టర్లు విడుదల చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు, బాధ్యులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల్ని పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు సన్నబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న హనుమకొండలోని ఏకశిల పార్కులో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సోమవారం హనుమకొండ సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాల్లో ధర్నా అనంతరం ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో ఉపాధ్యాయుల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కడారి భోగేశ్వర్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రెండు జిల్లాల బాధ్యులు కె.శ్రీనివాస్, జి.ఉప్పలయ్య, గొడిశాల సత్యనారాయణ పెండెం రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, ఉట్కూరు అశోక్, గోవిందరావు, వెంకటేశ్వర్లు, రాజయ్య డి.మహేందర్‌రెడ్డి, గోవర్ధన్, జగన్మోహన్, మహేందర్‌రావు, మల్లయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది



కట్టా శ్రీదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మడికొండ: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని కాజీపేట మండల విద్యాభివృద్ధి అధికారి బండారి మనోజ్‌కుమార్ అన్నారు. కాజీపేట మండలం మడికొండలోని ఎస్సీ, బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు కట్టా శ్రీదేవి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం పాఠశాలలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాలకొండరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉంటుందని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి, టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, టీఆర్టీయూటీఎస్ రాష్ట్ర సహ అధ్యక్షుడు కోమల్‌రెడ్డి, పీఆర్టీయూ హనుమకొండ అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు లింగరావు, ప్రతాప్, వీరప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## '108' సేవల 20 ఏళ్ల సంబురాలు



108 సర్వీస్ అధికారులను సన్మానిస్తున్న 108 ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగులు

హన్మకొండ అర్బన్: 108 సర్వీస్ ద్వారా పేదలకు వైద్యపరమైన సేవలందిస్తూ 20 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా 108 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నజీరొద్దీన్, ఈఎంఈ శ్రీనివాస్, ఈఎంటీ కంజుల వేణును సోమవారం సన్మానించినట్లు రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ బాలాజీ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా వేలాది మంది పేదల ప్రాణాలు కాపాడి అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నామని అన్నారు. భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బోయినపల్లి దేవేందర్‌రావు, ఉద్యోగులు దస్తగిరి, చైతన్య, సురేందర్, స్వాతి, మమత, లవన్‌కుమార్, అశోక్‌రెడ్డి, 102 ఉద్యోగులు సురేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

### తైక్వాండో పోటీల్లో పాల్గొనే స్కాలర్‌కు ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలోని పరిశోధకురాలు మాచర్ల కృష్ణవేణి ఈ ఏడాది ఆగస్టులో మలేషియాలో జరగనున్న 10వ ఆసియా పారా తైక్వాండో పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ తరపున కృష్ణవేణికి రూ.25 వేల విలువైన చెక్కును కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సోమవారం అందజేశారు. కృష్ణవేణి అభ్యర్థన మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాలతో కేయూ స్పోర్ట్స్ బోర్డు ప్రొఫెసర్ వెంకయ్య పర్యవేక్షణలోని స్పోర్ట్స్ బోర్డు ఖాతా నుంచి ఈ ఆర్థిక సాయం అందించినట్లు కేయూ దివ్యాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ రాజు వివరించారు.

### పోస్టల్ బీమా చెక్కు అందజేత



రజనికి బీమా చెక్కు అందజేస్తున్న రవికుమార్

ఖిలా వరంగల్: పెద్ద వంగర గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోధుమల రవికుమార్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు రవికుమార్ వరంగల్ తపాలాశాఖలో పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకున్నారు. ఈ మేరకు మృతుడి భార్య గోధుమల రజనికి రూ.9,83,057 విలువైన బీమా చెక్కును వరంగల్ తపాలాశాఖ డివిజనల్ సూపరింటెండెంట్ రవికుమార్ సోమవారం అందజేశారు. యశోద, గోవర్ధన్, పీఎల్‌ఐ బీమా సలహాదారు సాయికృష్ణ పాల్గొన్నారు.

### వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులు అందిస్తున్న దాతలు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయానికి కొసరి భాస్కర్, సంధ్యారాణి దంపతులు 11 తులాల వెండి వస్తువులను బహూకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ గౌడ్, ఆలయ ప్రధాన అర్చకుడు రఘునాథచార్యులు పాల్గొన్నారు.

### రౌడీ షీటర్ సురేష్ అరెస్ట్



ఖిలా వరంగల్: పలు కేసుల్లో నిందితుడైన రౌడీ షీటర్ కోతి సురేష్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. కొంతకాలంగా పోలీసుల కళ్లు గప్పి తప్పించుకొని తిరుగుతున్న వంచనగిరి సురేష్ అలియాస్ కోతి సురేష్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో ఈనెల 6న బీరన్న బోనాల పర్వదినం జరగగా.. రౌడీషీటర్ సురేష్ తన అనుచరులతో ఓ యువకుడి ఇంట్లో చొరబడి అమానుషంగా దాడి చేసిన కేసులో తప్పించుకొని తిరుగుతున్నాడు. ఈ మేరకు జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

## నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్పన్ నాగరాజు



మడికొండ: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మడికొండ: వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే కర్పన్ నాగరాజు తెలిపారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ టేకులగూడెం గ్రామంలో డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు, మామునూర్ విమానాశ్రయం నిర్మాణం, ఉనికిచర్లలో స్పోర్ట్స్ స్కూల్, అంతర్జాతీయ స్టేడియం, భద్రకాళి ఆలయాభివృద్ధి, అండర్ డ్రెయినేజీకి సీఎం సుముఖత వ్యక్తం చేశారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ అండ్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కార్పొరేటర్ ఆవాల రాధిక రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**కేటీఆర్ దిగజారి మాట్లాడుతున్నారు**

హసన్‌పర్తి: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామావుకు తన స్థాయి మరిచి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. నగరంలోని 56వ డివిజన్ పరిమల కాలనీ, సురేంద్రపురి కాలనీ, పెగడపల్లిలో సుమారు రూ.1.10 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని కేటీఆర్ ఏకవాచనంతో సంబోధించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్‌కుమార్, అరుణకుమారి, జక్కుల రజిత, డివిజన్ అధ్యక్షులు కొంక హరిబాబు, శివరాం, వెంకటరమణ, మణీందర్‌నాథ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కూరగాయల వ్యాపారుల ఆందోళన



నిరసన తెలుపుతున్న మార్కెట్ వ్యాపారులు

కాజీపేట: కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం -2ను వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ చిరు వ్యాపారులు సోమవారం దిగ్బంధించి ఆందోళన చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు నిరసన తెలిపారు. కాజీపేట పట్టణ రహదారులపై ఇష్టానుసారంగా కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులను వెంటనే మున్సిపల్ అధికారులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్‌కు వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ సిబ్బంది విధులకు హాజరు కాకుండా గేటు ఎదుట చిరు వ్యాపారులు ఆందోళనకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకుని చిరు వ్యాపారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నిషాని భిక్షపతి, సభ్యులు యేసు, విజయ్, చిన్న, బీజేపీ నాయకులు ఎండీ.చాంద్ పాషా, చిర్ర నర్సింగ్ గౌడ్, భగవాన్‌దాస్ ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**ఆర్టీసీ బీసీ సంఘం గౌరవాధ్యక్షుడిగా రాంప్రసాద్**

హన్మకొండ: ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ -1 డిపో గౌరవ అధ్యక్షుడిగా ఏనుగుల రాంప్రసాద్‌ను ఎన్నుకున్నారు. హనుమకొండలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ -1 డిపో కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఏనుగుల రాంప్రసాద్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మానస, గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన రాంప్రసాద్‌ను సన్మానించారు.

**గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ**

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ వరంగల్ అధ్యక్షుడు కొండూరి శివప్రసాద్, క్లబ్ వైద్యారోగ్య డైరెక్టర్ డాక్టర్ హరిరమాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు.

**'ధర్మస్థల' బాధ్యులపై చర్య తీసుకోవాలి**

విద్యారణ్యపురి: కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల పుణ్యక్షేత్రం ప్రాంతంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలిచివేస్తోందని, ఆ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని సైంటిఫిక్ స్టడీ ఫోరం ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చారువాక డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల సుమన్, బాధ్యులు పల్లె ప్రశాంత్, పెండ్యాల స్టెలా పాల్గొన్నారు.

**గేదెల చోరీ ముఠా అరెస్ట్**

గీసుకొండ: గేదెల దొంగల ముఠాను గీసుకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. గీసుకొండ మండలం రత్తిరాం తండాకు చెందిన రైతు వాంకుడోతు బాలరాజు ఇంటి ఎదుట కట్టేసిన మూడు గేదెలను ఈనెల 17న రాత్రి దొంగలు తీసుకెళ్లారు. బాలరాజు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సోమవారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దొంగలను ఊకల్ క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నారు. వారి నుంచి గేదెల చోరీకి ఉపయోగించిన వ్యాన్, ద్విచక్ర వాహనాలు, ఆరు సెల్‌ఫోన్లతో పాటు గేదెలను అమ్మగా వచ్చిన రూ.85 వేలు స్వాధీనం చేసుకున్నట్లు గీసుకొండ సీఐ మహేందర్ తెలిపారు.

**కులాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి**

రామన్నపేట: కులం అభివృద్ధిలో యువత ముందుండాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తం రావు సూచించారు. మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన వరంగల్‌కు చెందిన నీలం రాజ్‌కిశోర్ సోమవారం హైదరాబాద్‌లో పురుషోత్తంరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పురుషోత్తం రావు అభినందించారు.

**డాక్టర్ తాళ్ల దర్మినికి ఎక్సలెన్సీ అవార్డు**

ఖిలా వరంగల్: భారతరత్న అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని లీడ్ ఫౌండేషన్ గ్లోబల్ ఆధ్వర్యంలో ఖిలా వరంగల్ పడమర కోటకు చెందిన డాక్టర్ తాళ్ల దర్మిని.. వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు.

**అనాథలకు అన్నదానం**

హన్మకొండ చౌరస్తా: అపర్ణ సోషల్ సర్వీస్, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బొచ్చు అపర్ణ కుమారుడు రిశ్వాక్ పుట్టిన రోజు సందర్భంగా హనుమకొండ బస్టాండ్, ఎర్రగట్టు గుట్ట, హనుమకొండ చౌరస్తా ప్రాంతాల్లోని అనాథలకు సోమవారం భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు బొచ్చు నరేష్, విశ్వాక్ పాల్గొన్నారు.